

# దేవరగట్టు

జి. వెంకటకృష్ణ

డు ర్ర్ర్ ..... గో పరాక్... డుర్ర్ర్ ..... డుర్ర్ర్ ..... గో పరాక్ లయబద్ధంగా పెనుకేకలు పదేపదే... వాటిని మారు పలుకుతూ వేలాది గొంతులు. డుర్ర్ర్ గో పరాక్ శబ్దానికి అర్థం, యుద్ధానికి సన్నద్ధం అని. అదొక యుద్ధోన్మాదపు పిలుపు!

చుట్టూ చీకటి నిండిన రెండు కొండల నడుమ అరణ్యప్రదేశం, దాన్ని వెలిగిస్తూ వేలాది కాగడాలు. అడవినీరవ నిశ్శబ్దాన్ని ముక్కలు ముక్కలు చేస్తూ తెలుగూ కన్నడం కలగలిసిన అరుపులూ - కేకలూ. వాటి మధ్య లయబద్ధంగా భూమిని తాకుతున్న వేలాది వెదురుకర్రలు చేస్తున్న శబ్దం. అప్పుడప్పుడూ భయం పుట్టిస్తూ, గాల్లోకి అన్ని వేల వెదురు కర్రలు ఒక్క సారిగా లేచి విన్యాసం చేస్తే వినవచ్చే 'సర్రు' మనే శబ్దం. మరు క్షణం వేలాది గొంతులు వున్మాదంగా, 'హరహర మహ దేవ మహామాళ మల్లేశ్వరా,' అంటూ స్తోత్రాలు. అక్కడక్కడా నేలమీద భగభగ మండుతున్న నెగళ్లు, వాటి చుట్టూ డప్పులమోతలు, ఢమరుక ధ్వానాలు, వెరసి ఆ ప్రాంతమంతా ఒక మానవ సమూహం హోరు హోరుమంటున్న రొద.

ఒక్కసారిగా కొండ మీద గుహ ముందు కాగడాలు గాల్లోకి లేచాయి. దాన్ని సంకేతంగా అందుకొని కొండమీద నుండి సింహాసనం కట్టదాకా కొండకే తొలిచిన మెట్లమీద నిలబడ్డ జనాల చేతుల్లోని వందలాది కాగడాలూ, కర్రలూ కూడా గాల్లోకి లేచాయి. 'జయ మాళ మల్లేశ్వరా, జయజయ మాళమల్లేశ్వరా' నినాదాలు మిన్నుముట్టాయి. హోరుమని పొంగులు పెడుతున్న నది మీద ఒక్కసారిగా పదింతల వొత్తిడితో వరద దూసుకొచ్చినట్లు పెళపెళ ధ్వానాలు చుట్టుముట్టినాయి. ఇనుప రింగులు తొడిగిన వేలాది వెదురుకర్రలు లయబద్ధంగా నేలను నాట్యం చేయగా

డుర్ర్ర్ ..... గో పరాక్

డుర్ర్ర్ ..... డుర్ర్ర్ ..... గో పరాక్

హెచ్చరికలు మిన్నుముట్టగా విగ్రహాలున్న పల్లకి మెట్లు దిగుతున్నది. ఇక సమరమే! దురాక్రమణదారులు విగ్రహాలున్న పల్లకిని ఆక్రమించాలని చూడడం, పల్లకిని పరిరక్షించే గుంపు దాన్ని అడ్డుకోవడం.

ఆ సన్నివేశం కోసమే ఎదురుచూస్తున్న నా కళ్లు మసకబారుతున్నాయి. నులుముకొని మంటల వెలుగులో ఏం జరుగుతుందోనని వెతికి వెతికి చూస్తున్నాను. చుట్టూ జనసముద్రమే, చుట్టూ శబ్దాల హోరులో ఆ దృశ్యాన్ని చూడ్డం అసాధ్యమే. అయితే చెవులు వింటున్న శబ్దాలను కళ్లు అన్వయం చేసుకుంటే, ఆ దృశ్యం కర్రల విలయతాండవం!

హాహాకారాలూ

హరహర మహదేవ నినాదాలూ

గోపరాక్ గోపరాక్ హెచ్చరికలూ

ఒక యుద్ధం కళ్లముందు.

విగ్రహాలున్న పల్లకి అలలు అలలుగా వెదురు కర్రల్ని తోసుకుంటూ దిగుతున్నది. పెళపెళ రవళులతో మనుషుల్ని తొక్కుకుంటూ, తోసుకుంటూ దిగుతున్నది. ఠంగు ఠంగుమని తల పుర్రెల్ని తాకుతున్న కర్రల పహరాలో అన్ని మెట్లూ దిగింది.

“వొద్దూ... యిట్లా తలలు పగలగొట్టుకోవద్దు, యిట్లాంటి ఆచారం ఒక అనాచారం... ఆటవికం... దీన్ని మానేయాలి. ఈ హింసను ఆపండి. చూడండీ ఎన్ని వందలమందికి తలలు పగిల్నాయో... వొద్దు కొట్టుకో వద్దు... ఆపండి... ఆపండి...” అరుస్తూ నేను పిచ్చిగా జనాల్లోకి జొరబడ్డాను, జనాల చేతుల్లోని కర్రలను పట్టుకోవాలని ప్రయత్నిస్తున్నాను.

“అన్నా వొద్దు కొట్టుకోకండి... కోర్టులు చెప్పి నాయి... కలెక్టర్ చెప్పినాడు కొట్టుకోవడం అనాగరికం... నా మాట వినండి...” నోరు పొయ్యేలా అరుస్తూ జనాల మధ్యా కలియతిరుగుతున్నాను.

“లే... నువ్వెవునివిలే, దీన్ని వొద్దనేదాన్కి... బాడుకావ్... యిది మా ఆచారంలే... పక్కకు ఫోవాయ్... సూసినాంగానీ... అంతగా సించుకుంటుండావు...”

“అన్నా యిట్లా కర్రలతో తలలు పగులగొట్టు కుంటే ఏమొస్తుందన్నా రక్తం వంకలు గట్టిస్తారా... అప్పీతప్పీ సచ్చిపోతే ఏంగతన్నా, దేవుని పేరుతో యీ బన్ని వుత్సవం జరుపుకునేది, సంపుకునే దానికేమన్నా, యిదేం అనాచారమన్నా... ఆపండన్నా...”

“లే...! యీతినెవుడో మనదాన్ని అనాచారమంటు న్నాడప్పా... యీతిణ్ణి రొంత సూసుకోండప్పా, ఎక్కువ తక్కువలు వొదురుతాన్నాడుగానీ, నాలుగు తగి లీండప్పా...” అంతే-

నాలుగు కర్రలు నా తల మీద నాట్యం చేసాయి.

“ఠంగ్... ఠంగ్...”

‘అబ్బా’..... అంటూ కళ్లు తెరిచా. బస్సులో వున్నా. బస్సు వేగంగా వెళ్తూ, ఎదురుగా వస్తున్న ఎద్దులబండిని ఢీ కొట్టబోయి, సడన్‌గా బ్రేక్ వేయడంవల్ల, విసురుగా నా తల సీటు పక్క నున్న రాడ్‌కు కొట్టుకుంది. నొప్పిగా వుంది. తల రుద్దుకుంటుంటే అప్పుడే బొప్పి కట్టేసింది.

“అబ్బా యెంతగా తగిల్యా ....” అనుకుంటూ కలను గుర్తు చేసుకుంటుంటే, “ఆలూరు, ఆలూర్” అంటున్నాడు కండెక్టర్. బస్ దిగాను.

పాత తాలుకా కేంద్రం, అయినా పల్లెటూరితనం అట్లనే వుంది. తెలుగు, కన్నడం కలగలిసిన ప్రత్యేకమైన యాస వున్న భాషా, ఆచార వ్యవహారాలతో ఇక్కడికి వచ్చిన ప్రతిసారి ఈ వూరు నాకు పాతకాలంలోకి వచ్చి నట్టుగాను, పాత ప్రపంచంలోకి వచ్చినట్టు అనిపిస్తుంది.

“...ఆచారం పేరుతో తలలు పగులగొట్టుకోవడం యేమిటి. యింత ఆధునికతలోకి వచ్చేసినా స్పేస్ షెటిలు, సెల్‌ఫోన్ల కాలంలో కూడా ఈ మధ్యయుగాల అలవాట్లు ఏమిటి, యిది అమానుషం. హింసను ప్రేరే పిస్తున్న యీ వేడుకను... కాదు... కాదు... న్యూసెన్స్... యీ న్యూసెన్సును ఆపేయాల, హైకోర్టు కూడా సీరియస్ అవుతోంది. ఏర్పాట్లు చేయండి. డిస్ట్రిక్ట్ అడ్మినిస్ట్రేషన్, పోలీసులూ కలసి పనిచేస్తే యిదేమంత పెద్ద యిష్యూ కాదు...”

జిల్లా కలెక్టర్, నిన్న సాయంత్రం జరిపిన సమా వేశంలో అన్ని శాఖలకీ తలావొక పని అప్పజెప్పాడు. అందులో భాగంగానే, ఆ పాతలోకాన్ని విడువలేక వుంటున్న మార్తమ్మ- దేవేంద్రలకు పని పెట్టొచ్చు అనిపించి, వెదుక్కుంటూ వచ్చాను. ఒక దుర్ఘటనతో నిస్సత్తువలో కూరుకుపోయిన ఆ జంటకు చిన్న సాయమైనా చేద్దామని వచ్చాను, అంతకుమించి యీ ప్రాంతపు యాస వాళ్ల నోళ్లలో విందామని వచ్చాను.

వూరుదాటి మాదిగ్గేరులోకి వచ్చాను. స్పేస్ షెటిల్ పంపినంత మాత్రాన సెల్‌ఫోన్లు వాడినంత మాత్రాన ఆధునికత వచ్చేసినట్లేనా! యీ పొగచూరిన పూరి గుడిసెలు, మట్టి మిద్దెలు, పురాతన వాసన వేస్తున్న యీ మనుషుల్ని చూస్తుంటే, రానట్టే అనిపిస్తుంది. చింతచెట్టుకింద చిళ్లాకట్టి ఆడుతున్న పిల్లల్ని చూస్తూ-

“మార్తమ్మక్క యిల్లు...” మాట పూర్తి కాకుండానే కాస్తా పొడుగ్గా పుట్టు వెంటుకలు తీయ్యక జట్టును జడలా వేసుకున్న పిల్లగాడు చిల్లను ఎగరేసి కసిగా కొడుతూ,

“పాట్లూ, పదాలూ పాడే మార్తక్కా... దేవేంద్ర గాడూ నా... అగో ఆ గుండు దాటుతానే సూడీ... ఆ అవులాగాడు ఇంటితానే వుంటాడు ఫో...” అని వెంటనే, “ఓ అయివారు... వాంతోని నీకేం పని...” అని నన్నడుగు తూంటే పక్కనున్న పిల్లగాడు

“యేమలేయ్ సుంద్రాజుగా అవన్నీ నీకేమిటి కిలే... మూసుకోని చిల్ల కొలుచువై వగలు సుద్దు లాతిని...”

పిల్లగాని అత్యుత్సాహానికి, దేవేంద్రతో వున్న చనువుకి నవ్వుకుంటూ, గుండు దాటుకొని గుడిసె ముందు నిలబడ్డా. లోపల పెనుగులాట జరుగుతున్న అలికిడి వినిపించింది. ఠక్కున ఆగిపోయా. ఎవరి మీదో కసి తీర్చుకుంటున్నట్లు వగరుస్తూ అరుస్తున్న దేవేంద్ర గొంతు.

“దేవా యింగ చాలు... దేవా యింగ చాలు...” బాధతో అరుస్తున్న మార్తక్క గొంతు.

నాలుగడుగులు వెనక్కు వేశా... వెళ్లిపోదామని. గాలికి ఓరగా తలుపు తెరుచుకుంది.

మార్తక్క నేల మీద పడి వుంది. చిందరవందరైన బట్టలూ, జుట్టూ, అక్క అరుస్తూ వుంది.

"ఎక్కడ్డప్పినోనివి సిక్కితివి దేవేంద్రా... నాకు మూలమైతివి, తాగి తందాన లాడుకుంటా, యీ రోత రోత పనులు చేస్కుంటా నా మీంద యిట్ల యిరగ బడ్తాండావు తుడుగోడా..."

"ఏమే వొగల్దానా... సంగిలం సేపుట్నుంచీ దుడ్లియ్యే దుడ్లియే అని బంగ ఫోతుంటే వులకవూ పలకవూ... ఫాయిలో బెడితే కాలవూ ఫొంతలో బెడితే నానోవుట్లా దానివి బ్యాడదానా, ఆ బొడ్లో నుంచి లెక్క బైటికి తియ్యే. ల్యాకుంటే నీ పిర్ర పగుల్తాది సూడి..." అంటూ తంతున్నాడు.

మార్తక్క కూడా దేవేంద్ర పొట్టమీద ఎగిచ్చి ఒక తన్ను తన్నింది, తాగి తూలుతున్న దేవేంద్ర వెల్లెలెకల పడ్డాడు.

"నన్ను తంతావారా దేవుగా..." మార్తా, అతని ఎద మీద కూచొని జుట్టుపట్టి గుంజుతూ చెంపలు అదర గొడ్తోంది.

"బ్యాడోడా యీ నడుమ నీది యెక్కువైపాయా, యిట్లనే జేస్తే నిన్ను వొగ దెంచుకుంటా సూడీ..."

అంతే, దేవేంద్ర మార్తక్కను రెండు చేతులా బంధించి, పొర్లి ఆమె మీదికొచ్చి ముఖంమీద ముద్దులు పెట్టుకుంటూ

"ఏ ప్లేయ్ మార్తీ ఒగ క్వోర్టర్ మందుకు దుడ్లియ్యే అనంటే నన్ని తన్ని వొగ దెంచుకుంటానంటావా, నువ్వా టికిపోతే ఆటికొస్తా... నీ యెంటెంబడే వొస్తా నిన్నిడ్సిపెట్టి నేనెట్లా బతుకుతానే నా బంగారు నంజుండమ్మా..." అంటూ శరీరాన్ని పెనవేస్తున్నాడు.

"ఏయ్ ఛూ... గబ్బునావొట్టవు... కంపుగొడ్తాం డావు... యిడ్సు యిడ్సు... యింతవరకీ యిరగబడింది సాల్లా..."

"ఏ ప్లేయ్ మార్తీ... ఓ ప్లేయ్ మార్తీ... అత్తరు దగిడి నా కునుసు సూడు ప్లేయ్... ఇగడదయ్యాతదిమి జడకోలన్న సూడుప్లేయ్.... ఒగ క్వోర్టర్ మందుకు దుడ్లీ ప్లేయ్..." పాటలాగా అందుకొని ఆమెను రెండు చేతులా ఎత్తుకొని నిలబడ్డాడు.

"పోసుకోంది సాల్లా... వూ... సాల్లేదా... నీ నోట్లోకి నా సాడూ, తాగేకీ, ఎగిరేకీ సరిపాయా... అవుగానీ నన్ను కల్సేతప్పుడు నంజుండమ్మాన్నెందుకు పలవరిస్తావురా గబ్బోడా..." చెంపల మీద కొడుతూ అడుగుతాంది.

కొన్ని క్షణాలు యిద్దరి మధ్యా మాటలు లేవు... తర్వాత దేవేంద్ర గొంతులో మూలుగు... విలవిలలాడు తున్నట్లుగా ఏడుపు...

"మార్తా... మార్తా... రెక్కలు కష్టిముజేసుకొని బతుకుతున్న ఒక ఆడమనిసి కాల్ల కిందపడి నలిగి నలిగి నంజిరి ముద్దై పాయెగదా. ఆయమ్మ మాయమ్మ... నాకష్టిములో, సుఖములో తలుసుకోంది, నాకైతాలేదు నేనేమి సేతు మార్తా..."

"దేవా... దేవా... వొద్దు... ఏడ్సొద్దు..."

ఆ తర్వాత ఖనఖనఖన్నన... డప్పు మోగిన శబ్దం. చాలాసేపు మోగుతూనే వుంది. దేవేంద్ర వుద్రిక్తంగా డప్పు మోగిస్తున్నాడు. మోగిస్తూ...

"ఏ మార్తీ పాటందుకోవే... ఏయ్... ఏయ్... అందుకోవే..." అన్నాడు.

అరాచక హింసలోంచీ... విరసపు సరసంలోంచీ, వుద్యమవుతున్న వాళ్ల ప్రేమోన్మాదం నన్ను ఆశ్చర్యపరు స్తుంటే... అక్క గొంతు 'ఆ చల్లని సముద్రగర్భం దాచిన బడబాలనమెంతో' గీతాలాపనలో మునిగిపోయింది. ఎన్నోసార్లు వినుంటాను. ఆమె కంఠం ఎప్పటికప్పుడు ఓ అద్భుతం, అతని డప్పుదరువు అతనికే ప్రత్యేకం, వాళ్లిద్దరూ కలిసి పాడితే సంగీతానికే సంబరం. పాట పూర్తి అయ్యేంతదాకా బయటుండి, లోనికొచ్చి నిల బడినా. దేవేంద్ర గబుక్కున లేచి, వూడిపోతున్న లుంగీని సర్దుకుంటున్నాడు, డప్పుపక్కన బెట్టి,

"ఏయ్ పర్ కాశూ..." మత్తుగా గొణిగాడు.

అక్క జుట్టును కొప్పుగా కట్టుకుంటూ, "ఏమప్పా యిన్ని రోజులకు యిట్లా వొస్తివి పొదుపు సంగాల సారూ యిప్పటికి గుర్తుకొచ్చిందా అక్క..." అంది.

అక్కను చూసినా, వొళ్లంతా హూనమైంది, నేల మీద చిందరవందరైన సామాన్లూ, బట్టలూ అంతదాకా జరిగిన గడబిడకు గుర్తుగా, "ఏందక్కా యిది..." అన్నా.

యూనివర్సిటీలో ఆధునిక చరిత్రల్ని చదివిన యీ మనిషి యీ పురాతన ప్రపంచంలో, యే ఆధునిక వ్యామోహాలు తాకనీకుండా ఎట్లా వుండిపోయిందో ఆలోచిస్తే నాకు ఆశ్చర్యం వేస్తుంది. యీ దేశంలోకి ఆధునికత వచ్చుండొచ్చు కాని పురాతన ఆచారవ్యవ హారాల్లో కొందరు మనుషులూ, కొన్ని ప్రాంతాలూ యింకా కూరుకుపోయే వున్నాయని చెప్పడానికి మార్తక్క, దేవేంద్ర ఒక గుర్తు.

"యీ ఫ్రీలాన్స్ వుద్యమకారుడు మారితే గదబ్బా..." నిర్లిప్తంగా అక్క.

వాళ్లది ప్రేమ పెళ్లి అంటే ఈ నిమిషాన నమ్మడం కష్టమే గానీ, నాలుగైదురోజులకు మళ్లా వాళ్లు చిలకా

గోరింకల్లా కిచకిచలాడుతున్నపుడో, లేదా, యీామె చీకులో, ఎండుచేపలో కాల్చిస్తుంటే, దేవేంద్ర క్వార్టర్ రౌండు మీద నుంచీ, 'మార్తమ్మా మర్మమెరగని మార్తమ్మా నా మర్మమెరిగిన మార్తమ్మా,' అని ఆమె మీద పాట కట్టి దరువేస్తా పాడతా వున్నప్పుడు చూసినా మంటే ఆశ్చర్యపోవాల్సిందే.

అక్క నాకు యూనివర్సిటిలో సీనియర్, వాళ్ల నాన్న వూరూర తిరిగి బైల్నాటకాలు నేర్పించే సంచార గురువు, పదాలు, పాటలు కట్టి వూరూరా తిరిగేవాడు. దాన్నే కూతురుకు పాటల వారసత్వంగా యిచ్చి అక్క చదువు పూర్తి కాకుండానే చనిపోయాడు. ఆయనెంబడి తిరిగే దేవేంద్ర ఆశువుగా పాటగట్టి పాడగల కవీ, గాయకుడూ, గురువు మరణం తర్వాత మార్తక్క కుటుంబానికి మరింత దగ్గరై, మార్తక్క వెంటబడి పెళ్లి చేసుకున్నాడు. అక్క పొదుపుసంఘాల పుస్తకాలు రాసిస్తూ, వచ్చిన ఆయింత ఆదాయంతోనే సంసారం నడుపుతుంది. నిజానికి పాటల సంసారం వాళ్లది. పాటలే ఇంత అన్నం పెడతాయి, పాటల్నే పిల్లల్ని చేసుకుని సాక్కుంటున్నారు వాళ్లు. ప్రజాసంఘాల పాటలు, సినిమా పాటలు, పొదుపుసంఘాల పాటలు వాళ్లింటో తిరుగాడుతుంటాయి. దేవేంద్రకు, మార్తక్కకు బైల్నాటకాల పదాలు నోట్లో నానుతావుంటాయి. దేవేంద్ర ఎంత వుత్సాహంగా వుంటాడో ఒక్కోసారి అంతే నిరుత్సాహంగానూ వుంటాడు, ఏకాంతంలోకి కూరుకుపోతుంటాడు. ఈ స్వభావమే అతని పరిచయస్తుల్ని ఆశ్చర్యపరుస్తుంది. అయినా గొప్ప పాటగాడు కావడంతో ప్రజాసంఘాలు దేవేంద్రను తమతో పనిచేయమని అడిగేవి. దేవేంద్రకు కూడా నచ్చిన విషయాల మీద ఎవరితోనైనా పనిచేసేవాడు. అందుకే మార్తా అతన్ని వ్యంగ్యంగా ఫ్రీలాన్స్ వుద్యమకారుడనేది. అలా పనిచేస్తూ ఇంతకు ముందు ఒగసారి పోలీసు నిర్భంధాన్ని ఎదుర్కొన్నాడు. రహస్య వుద్యమకారులతో సంబంధాలున్నాయనే అనుమానంతో టార్చర్ అనుభవించాడు. అప్పటినుండి ఎవరినీ కలవక తనలో తాను కూరుకపోయాడు.

వచ్చిన పని గుర్తొచ్చి, "అక్కా దేవరగట్టు రమ్మంటాందక్కా మనల్ని," అంటుంటే దేవేంద్ర తూలి పడబోయాడు, మార్తా అతన్ని వొడిసి పట్టుకుంది.

ఆమెను అలాగే పొదుముకొని, "దేవరగట్టుకు యేమిటికి? దేవరగట్టు రాచ్చసుని ముని ముని మనుమరాలు యీాడ్నే వుందిగదా... యీా మార్తాదేవి దర్శనం చేసుకో సాలు. ఆటికి నేను రానుగానీ, ఓప్లేయ్ మార్తా దేవుతా... క్కే... క్కే... క్కే... ఓ ప్లేయ్ మార్తా రాచ్చసీ ఒగ నూర్రూపాయలీవే... క్వోర్టరు మందుకు నీ తమ్ముంతో విందుకు..." దేవేంద్ర మత్తుగా నవ్వుతున్నాడు.

"యేం దేవేంద్రా దేవరగట్టుగు రావూ..." అన్నా.

"నేను నూర్రూపాయలీనందుకు యీా అవుతారం యెత్తినాడు. దేవురగట్టుకు రావడానికి యేమీగావాల్నో అడుగు..."

"దేవురగట్టు... రావాలంటే మా అమ్మప్రాణాలు యివ్వాల, యిస్తావా ఏయ్ పర్కాశూ యిస్తావా... చచ్చిపోయిండే మా అమ్మనిస్తావా... నంజిరి ముద్దైపోయిండే మా అమ్మనిస్తావా..." మార్తా నడుం చుట్టూ చేయివేసి బిగిస్తూ హిస్టీరిక్‌గా అరుస్తున్నాడు.

"ఏయ్ దేవేంద్రా..." హెచ్చరికగా అరచి, వూడిపోతున్న జుట్టును ముడివేసుకుంటూ, దేవేంద్రను విడిపించుకొని మంచం మీదికి తోసింది మార్తా. దేవేంద్ర యేదో భయంతో వణికిపోతూ, ఇంకేదో వొర్లుతూ మగతలోకి జారుకున్నాడు. దేవేంద్రను చూస్తుంటే, అంత వరకూ క్రూరంగా వేటాడుతూ వుండి ఏదో బలీయమైన శక్తి ఎదురుగా వచ్చి అడ్డగిస్తే, భయంతో అణిగిపోయిన జంతువులాగా అన్పించాడు.

"దేవరగట్టుకు ఎందుకు ప్రకాశూ..." అందక్క.

"ఏంలేదక్కా కళాజాత ప్రోగ్రామొకటి నాకు అప్పజెప్పారు. పొదుపు సంఘాల తరపున హింస మానమని ప్రచారం చేయాలా. సంఘాల్లో వుండే ఆడవాళ్లు చెప్తే వాళ్ల భర్తలు వింటారంట. ఇంటింటికీ హింస మానమనే సందేశం తీసుకుపోవాలని ప్రయత్నం, అందుకే మొదట మీ యింటికొచ్చినా..." కలెక్టర్ ఆలోచనల్ని వ్యంగ్యం చేసి, నేను నవ్వుతూ చెబుతున్నా... అక్క నవ్వలేకపోయింది.

"'అబ్బా టయానికొస్తివి... చేతిలో పైసాలేదు... దేవేంద్ర చూస్తే వున్మాదం మీదేసుకున్నాడు... లేస్తానే దేవేంద్రకూ చెప్పు గ్యారెంటీగా వొస్తాం..."

"అవునక్కా ఏందీ హింస..." దేవేంద్రను చూస్తూ అన్నా.

"ఏ హింస ప్రకాశ్... దేవరగట్టుదా... మా యింట్లోదా నువ్వడిగేది".

"రెండూ, నీయెంటబడి ప్రేమించినోడు యీా లెక్కన తయారైనాడు, యీా మనిషి మారడా..."

"నీకు తెల్సుగదా ప్రకాశ్ దేవేంద్రా యెట్లా వుండేటోడో, వాళ్లెంబడి తిరుగుతూ పాటలు పాడిన ఆయింత దానికి పోలీసోల్లు చేసిన నిర్వాకంతో ఎంత అనుభవిం

చామో మాకే తెల్సు, మీరంతా మా యెనకల నిలబడి తిరి గాబట్టి బయటికొస్తిమి, ఆ రెండ్రోజులూ లాకప్‌లో వుండ్యాలకి దేవేంద్ర తలకిందులైపాయ, ముందునుంచి దేవేంద్రకు ఫోబియో వుందిగదా, పైకి మామూలుగా కన్పించినా లోపల భయంతో, హింసతో నలిగి పోతుం టాడు. వాల్లమ్మ గుర్తొస్తే విచ్చిత్రంగా ప్రవర్తిస్తాడు... యిరికిరుకులో వుండలేడు. చీకట్లో వుండలేడు. ఆఖరికి సినిమాహాల్లలో కూడా కూచోలేడు. గేట్లు మూసుకొని పోయి బయటికి రాలేనని భయం... అది యింగా ఎక్కువైపోయా, తాగుడుకు ఎక్కువ అలవాటు పడ్యా, నేను సర్దుకోకపోతే యింగెవురు సర్దుకుంటారప్పా చెప్పు..."

"యిప్పుడేమీ పోలీసుల సమస్యలేదు కదక్కా..."

"లేదు ప్రకాషూ... మేం చేసింది కూడా యేమీ లేదుగదా... పాటలు పాడ్డ మొక్కటే గదా... ఆ తర్వాత మా జోలికేమీ రావట్లేదుగానీ, ప్రకాషూ ఆయింత జరిగి నెంక మేమిద్దరం చచ్చే బతుకుతున్నాం, అది పుండు లాగా నొప్పి... ముందులాగా లేం..."

"తెల్సుకా... అందుకే జనాల్లోకీ, పాటల్లోకీ తెద్దా మనే ఇప్పొడొచ్చింది... పనిచేసేవాళ్లు యేదో వొగ స్థాయిలో పనిచేస్తూనే వుండాల, ల్యాకుంటే మనకు మనం మాయమవుతాం, అందుకే దేవరగట్టు ప్రయాణం."

"కరెక్టే ప్రకాషూ... ఎటు తిరిగీ దేవేంద్ర జనాల్లో పడాలనే నా ఆశ..."

"మరి దేవరగట్టు కతేందక్కా...."

"అది దేవుని పేరుతో దేవున్ని దక్కించుకుంటే పొందే లాభాల కోసం వెంపర్లాట, బయటికి కర్రల సమరంగా మనకు కన్పిస్తుంది. గానీ దాని అంతరార్థం వేరే. నేనూ దేవేంద్రా ఒక బైల్నాటకం లాంటిదాన్ని తయారుచేశాం. నీ పుణ్యాన యిప్పుడు దాన్ని జనాలకి చూపడానికి అవకాశం వొస్తావుంది. దేవేంద్రను జనాల్లోకి తోయడానికి అవకాశం వొస్తావుంది."

"సర్లేక్కా.... కళాజాత వేదిక మీద బైల్నాటకాన్ని వేద్దుర్లే."

*

"భళి భళిరా మాయావీ, వర్తమానమేమిటిరా, నా యీ హిరణ్యకారణ్యంలో మునులు అరాచకాలు తల మీరినాయేమిరా, మన బంటులు యేమిసేయిచున్నారురా, అరెరే ఢింభకా పలకవేమిరా, బాహుబల విక్రమ బలాఢ్యుడను మునులు నా రాజ్యమును బలికోరుచున్నారు కదరా, మన అసురప్రభల చండప్రచండ ప్రతాపాగ్నికీలలలో మునిశాలలను భస్మం చేయమన్నాను కదరా, అయిననూ యీ అరణ్య మధ్యమ అసురసీమలలో మన మాయామోళీజాలములు ఆరి ముని మైదానముల హోమమేఘములు కమ్ముకొనుచున్నవే... మన ప్రతిక్రియ యేమిటిరా బయలుపరచరా," వేదిక మీదికి విలయతాండవం చేస్తూ మహామల్లాసురుడు ప్రవేశించాడు. అతని వెంటే అతని అనుచరులు.

"రాక్షస కులభలా మహామార్తాండ మహోదరా మహామల్లాసురా, దొరా నీ ప్రచండచండ బాహుబల పరాక్రమాగ్నికి దహించని పర్ణశాలలేమున్నవి. అయినా నీకు తెలియనిదేమున్నది, అసురదేవరా మునిపల్లెలు మునివీరుల బాణములవలె విస్తరిల్లుచున్నవి, వారి గండ్రగొడ్డళ్లవలె చెలరేగుచున్నవి, అసురవీరుల రక్త ధారలు చింది నేల ఎరుపెక్కుతున్నది. అవి ముని శాలలు కావు మనపాలిటి బలిశాలలు. ఆ మాయావులు చేస్తున్నది తపస్సుకాదు, మనపై కుట్రల ఫలసాయం, మన ఆయువుపట్లైన జంతుజాలమును, వృక్ష రాజ్యమును తెంచి మనలను చుట్టుముట్టుతూ మన వీరుల ప్రాణాలకు వురులు పన్నుతున్న యీ మునుల పీడ విరగడకు మీరే దారి చూపాలి," మాయావి మాటలు ముగుస్తుండగనే మణిమహాసురుడు వేదిక మీదికి ప్రవేశించి,

"అన్నా మహావీర యీ మునులు వారి వెంట సురలూ ఒక వ్యూహం. తపస్సు పేరట ముందు వచ్చెడి వారు మునులూ, వారి వెనువెంటనే సురలూ, కొడవలి గొడ్డలి చేదాల్చిన హరులూ, గదఖడ్గాదులు భుజాన విల్లంబులతో, నాగలి చేతపట్టి బలాధములూ. మునులు తపస్సు ఒక నెపము, అడవిని నరికి దహనం గావించి మైదానం చేయడమే దృఢనిశ్చయము. అడ్డొచ్చే అసురజాతిని నిర్మూలించడమే లక్ష్యం. యీ కుట్రను ముక్కలు చేయందే మనకు లేదు మనుగడ."

"అవును తమ్ముడూ, అవును, అవి మునిశాలలు కావు మనలను అంత మొందించే పర్ణశాలలు. యిక తప్పదు ప్రతిఘటన, పద పద ఎదుర్కొందాము మన జాతి సంరక్షణ."

"భళిరా సారథీ, యీ రాక్షస శకటాన్ని మళ్లించు మురా ముని క్షేత్రాలవైపు అడవుల నరికి మన వేట జంతువులను నిర్మూలించిన మైదానకర్తల వైపు, వెంట రారా మాయావీ నీ టక్కుటమార మోళీపాలీ విద్యలు నేర్చిన మాంత్రిక, తాంత్రిక బంటుల వెంటబెట్టుకొని,

భళిరా సారథీ, యీ పొద్దు విరుగడైపోనీ మునుల కుట్రలు యీ యుద్ధాన అంతమైపోనీ.''

"అది అదిగో అసురదేవరా నీ యెదుట మునివేష ఆయుధధారి ఎంత పొగరుగా వేటాడుతున్నాడో చూడు నీ రాజ్యమనే వెరుపులేక, తలపు లేక, వాడెవడో కాదు వాడిపేరు భైరవుడు, మునులపాలిటి రక్షక కాల భైరవుడు.''

వేదిక మీదికి విల్లంబులతో, గండ్రగొడ్డలితో ప్రళయగర్జనతో ఎగిరి దుమికాడు భైరవుడు.

"ఎవడురా నువ్వు, నా రాజ్యంలో తిరుగుతున్న ముని వేషధారివి,'' అంటూ గర్జించాడు మల్లాసురుడు.

''నువ్వేనేరా మునిపల్లెల మీదబడి పశు సంపదను దోచుకుంటున్న రాక్షసుడివి,'' అంటూ భైరవుడు ఎదురుప్రశ్న వేశాడు.

"నా రాజ్యంలో నా అనుమతి లేకుండా వున్నం దుకు వాళ్లివ్వాల్సిన పన్నురా అది,'' బదులిచ్చాడు మల్లాసురుడు.

"ఇక అది చెల్లదు... నువ్వెవడికి రాజువురా, నీ కోసమే వెదుకుతున్నాను యిదేనీ అంతం...'' అంటూ బాణాలు ప్రయోగించాడు భైరవుడు.

బాణం తగిలి మల్లాసురిడి దేహం నుండి నేల రాలిన ప్రతి రక్తపుబొట్టు నుండీ ఒక్కో యోధుడు పుడు తున్నాడు.

బాణాలు వేసి వేసి అలసిపోయిన భైరవుడు,

"ఘృతమారీ...'' అంటూ ఎలుగెత్తి పిలిచాడు.

భైరవుడు చూపిన ఆశకు లొంగిపోయిన ఘృత మారి, మణిమల్లాసురల రక్తం నేల రాలకుండా తన నాలుకతో అడ్డుకుంటుంటే, భైరవుడు తన బాణాలతో వొక్కొ రాక్షసుడినీ సంహరిస్తున్నాడు.

చివరికి మణి మల్లాసురులు భైరవుడి బాణాలు తాకి తాకి శిలలుగా మారిపోయారు...

కలలా కథాగానం నడుస్తున్నది... మార్తక్క, దేవేంద్రల గొంతుల్లోని మాధు ర్యానికి బొమ్మలై వింటు న్నారు అందరూ. ఆలూరు చుట్టుపక్కల పల్లెల్లో కళా జాత బృందం ఒక వాహనం మీద వేదిక ఏర్పాటు చేసుకొని కథలూ, పాటలూ పాడుతూ దేవరగట్టు హింస మూలాలను వివరిస్తూ వెళ్తున్నాం.

వూరూరా జనాలు మా వాహనం చుట్టూ మూగి మా వాళ్లు ఆడే ఆటల్నీ పాడే పాటల్నీ చూస్తూ మైమరచి వింటున్నారు. చూపుల్ని ఆకట్టుకొనే రూపం మనసును పట్టుకొనే గానంతో మార్తమ్మ జనాల్ని సమ్మోహితుల్ని చేస్తోంది. ఆమె చుట్టూ మూగే మగవాళ్ల కళ్లల్లో కాంక్ష నగ్నంగా కనిపించేది. మార్తమ్మను ఆసక్తిగా చూసే వాళ్లను దేవేంద్ర ఆందోళనగా చూసేవాడు. దేవేంద్ర ముఖంలో మారిపోయే రంగుల్ని ఎంత వద్దనుకున్నా గమనించాల్సి వచ్చేది. వాళ్లను దేవేంద్ర కసురుకోవడం, వాళ్లు రెచ్చిపోవడం, దాంతో దేవేంద్ర మార్తక్క వైపు కసిగా చూడ్డం నన్ను కలవరపెట్టేది.

ఆ కసిలోంచే హింస పుడుతుంది మరి! సాయంత్రం తిరిగి వెళ్లేప్పుడు గొడవపడేవాడు.

"వానాలి వానెక్క ఎవుడే వాడు నీ తుక్కు అట్ల సూస్తున్నాడు.''

"ఎవుడో తలమాసినోడు, మనం పాటలు పాడే వోళ్లం... కళాకారులం... ఎంతోమంది చుట్టూ నిలబడి చూస్తారు, వింటారూ వాళ్లని గురించి ఎందుకు తల సెడుపుకుంటావు.''

"ఎవుడు పడితేవోడు నిన్ను చూసి యికిలిస్తాంటే చూసి వూరికే వుండాల్నేమే, అందుకే నిన్ను తన్నాలని పించేది కర్రిమొకందానా...''

"యీ పొద్దుతో ఆఖరు వాడెవుడో తిక్కనాకొడు కనుకో, ఆతినితోని ఏం పని నీకి...''

వాళ్లెంత మెల్లగా మాట్లాడుకున్నా, దేవేంద్ర గొంతులోని తీవ్రత వల్ల అది నాకు వినిపిస్తోంది, ఐదు రోజులుగా కళాజాత ప్రదర్శనతో వూరూరా తిరుగు తూంటే మార్తమ్మ గొంతులోని సమ్మోహనానికి చాలా మంది ఆమె చుట్టూ తిరుగుతున్నారు. వాళ్లలో బోయ బజారి వొక అడుగు ముందుకేసి మార్తమ్మ మెడలో నోట్లదండ వేయబోయాడు.

''యేమనా... మామేమి డ్రామా కంపెనీవోళ్లం గాము, యిట్లా అలవాట్లు మీరు మానుకోవాలనే మేం యీ ఆట ఆడుతుండేది'' అని మార్తమ్మ వెనక్కిచ్చే సింది.

''ఏమ్‌లే... తలకాయ తిరుగుతుందేమలే... యెక్కడ్డప్పిన్నాకొడుకా... నీ పిసురు పడేతట్లు తంతాలే...'' అంటూ దేవేంద్ర కోపంతో అతని మీదికి పోతూంటే నేను పట్టుకున్నా, బోయబజారిని జనాలు తోసేసారు. "సూసుకుందాంరాలే... నీ తల్లి...'' అంటూ వాడు తాగి వొర్లుకుంటూ వెళ్లిపోయాడు.

ఒకవైపు కళాజాతతో మేం వెళ్తూంటే యింకోవైపు పోలీసులు వూర్లమీద బడి యిండ్లలోకి జొరబడి సోదాలు చేస్తున్నారు. ప్రతిరోజూ వందలు వందలు వెదురుకర్రల్ని యిండ్లలో నుంచీ జీపుల్లో తీసుకు

పోతున్నారు. పోతూ పోతూ కోళ్లూ మేకలూ కూడా తీసుకు పోతున్నారు. సారా కాస్తున్నారనీ కొందరిని అరెస్ట్ కూడా చేసి స్టేషన్‌కు తీసుకుపోతున్నారు. ఒక హింసను ఆపడానికి యింకొక హింసలోకి మనిషి ఎలా నడిచి వెళ్తాడో గదా... అని నేను ఆలోచనల్లో వుండగా,

"ఈ కళాజాతను ఆర్గనైజ్ చేస్తుంది ఎవురండీ సారు..." నన్నే అడుగుతున్నాడు ఒక పెద్దాయన.

"ఎందుకూ ఏం కావాల పెద్దాయనా"

"నా పేరు మహాలింగారెడ్డి యీ వూరి సర్పంచిని, వూరికే అడుగుతున్నా..."

"అవునాసార్.... చెప్పండి ఏమైనా లోపాలు న్నాయా...." అన్నా.

"అహ ఏమిలా, బాగానే చేస్తాండారు... మీకు చెప్పేదానికి మా చాత అయితాదా, మేం చెప్తే మాత్రం... మీరు వింటారా..."

"అట్లా కాదు... మీరు చెప్పండి కొత్తగా చేర్చు కుంటాం..."

"ఇదంతా సరేగానీ సారూ, మా ఆచారం సంగ తేందో రొంత ఆలోచన సేయాల గదా... మామేమన్నా కావాల్సికి తలలు పగులగొట్టుకుంటామా, అదొగ ఆట... మీరెట్లా మాకు మీ విద్య చూపిస్తా వుండారో మేమూ అట్లనే దేవుని ఆట ఆడతాం, పూర్వకాలం నుంచీ యిది నడుస్తానే వుంది. మా కండ్లు పెట్టుకొని చూస్తే, మీకు తప్పు అన్పించేది వొప్పుగా అన్పిస్తుంది. శివుడికీ మల్లా సురిడికీ యుద్ధం ముగిసినాక, మల్లాసురుడిని శివుడు వరం కోరుకోమంటే ప్రతియేటా రక్తతర్పణ యివ్వ మన్నాడంట. ఆ ప్రకారమే నడుస్తానే వుంది. దాన్ని బన్నీ వుత్సవం అంటాము, యుద్ధం చేసుకున్నట్లు ఆట ఆడుతాం, ఆయింతదాన్ని మీరు అపార్థము సేసు కుంటుండారు.

"అదిగాదు పెద్దాయనా, అది ఆట అయితే, అర్ధరాత్రి ఆడేది ఎందుకూ తలలు నిజంగా పగులగొట్టు కోవడమెందుకు, ఒక్కోసారి కొందరి ప్రాణాలూ పోతున్నాయి గదా..."

"అవునుసారూ... మీరు తెల్సినోళ్లుగదా, కబడి ఆట, బాక్సింగు ఆట యావావో ఆడుతారు గదా... పోటీలు పెట్టి ఆడిపిస్తారు గదా... ఆ ఆటల్లో దెబ్బలు తగులవా కాళ్లూ చేతులూ యిరుగవా... ఆ యింతదానికి కబడీ ఆటనో, బాక్సింగు ఆటనో ఆడనీరా... ఏమి".

"అయ్యో పెద్దాయనా- మీ పోలిక బాగాలేదు. ఆ ఆటల్లో ఆడేవాళ్లు శత్రువులు కారు. ఆట తర్వాత అంతా స్నేహితుల్లాగా కలిసిపోతారు. మీ ఆటలో అట్లాగాదు..."

"ఎవురు సెప్పిరి సారూ మా బన్నీ వుత్సవం గూడా శత్రువులు ఆడుకునే ఆట ఏమీకాదు, కర్నాటకం నుండీ, మహారాష్ట్ర నుండీ లక్షలాదిగా జనాలు సూడ్డాని కొస్తారు యీ తావుకి, తోపులాట జరగమంటే జరగదా... అడవి గాబట్టి పురుగూపుట్రా కోసరం కర్రలు తెచ్చు కుంటారు జనాలు, తోసుకున్నప్పుడు తలకి తగుల్తాయి. పల్లకీ వూరేగింపు జరిగేప్పుడు విగ్రహాలకి ఎవరుపడితే వాళ్లు తాక్కుండా కాపలాగా కర్రలతో అడ్డుకుంటాము. ఎవుర్నీ కొట్టము సారూ, అందరూ భక్తులే గదా."

"భక్తి పేరుతో తలకాయలు పగలగొట్టుకునే అనాగరికుల్ని తయారు చేస్తున్నామండీ."

"అట్లయితే బుర్రలు పగుల్తాయని తెలిసి యిన్ని వేలమంది ఎందుకొస్తుండారు సారు యీ తావుకి."

"అదేనండీ అర్థంకాని విషయం."

"అదే సారూ, తమాషా... యిన్నివేల మంది జనాలు యిట్లా యీ అడవిలోకి ఎందుకొస్తున్నారు సారూ... యావావో మొక్కుబడులకోసరమే గదా, పిల్లోల్లు పుట్లేదనో, పుట్నా కండ్లూ కాళ్లూ లేవనో, రోగాలతోనో పుట్నారనో, ఆ బాధలు తీసేయమనో, పంటలు పండుతలేవనో, గొడ్డూగోదమూ ఎదగలేదనో, ఆడబిడ్డల పెండిండ్లు కాలేదనో, యిట్లాంటివి యెన్నెన్నో, మనం లెక్కలోకి యేసుకోనివి ఎన్నెన్నో, సన్నవీ, పెద్దవీ, అన్నీ కష్టాలే గదా జనాలకి, సదువుకోని పెద్ద పెద్ద వుద్యోగాలు జేసే మీ లాంటోల్లకి అవి పెద్దగా అన్పీక పోవచ్చు. జనాలకి అందులోనూ మోటుజనాలకి అవన్నీ కష్టాలే గదా, అవుట్లను బాగుజేసుకోవడానికి యాటికి పోవాల్నో మనవేమన్నా దారి సూపుతాండామా, సూపినా, అరాకొరా దారేగదా... ఆపీసుల చుట్టూ కుక్కలెక్క తిరిగీ తిరిగీ బేజారైనోల్లు యిట్లాంటి జాతర్లకి యేడాదికి వొగసారైనా రాగూడదా, వొచ్చినందుకు అంతోయింతో మనశ్శాంతి వాళ్లకి సిక్కితే మనకేమన్నా నొప్పా. ఏం న్యాయం సారూ మనది, అమ్మా పెట్టదూ, అడుక్కోనీ తిన్నీదు అట్లుంది. జనాలని యిట్లాంటి తావు లకు తోసేదీ మనమే, అట్లాపోయి అంతోయింతో మనశ్శాంతి సిక్కిచ్చుకుంటే వోర్చుకోకుండా మీ ఆచారం తప్పు, మీరు అనాగరికులు అని ప్రచారం చేసేదీ మనమే..."

"అయితే కాలం యింత ముందుకొచ్చింది గదా... యిన్ని మార్పులు జరుగుతున్నాయి గదా... దాంతో

పాటు మీరు కలసిరారా... మారిన కాలం జనాల్నేమీ మార్చదా...''

''ఎందుకు మార్చదు సారూ... యింతకు ముందు దేవరగట్టుకు నడుసుకుంటానో, ఎద్దులబండ్ల మీదనో వొచ్చేవాళ్లు. యిబ్బుడు కాలం మారింది, జీపులూ, ట్రాక్టర్లూ, వ్యాన్లూ వోయబ్బా దూరబారం నుండీ బస్సులూ సెప్పలేనన్ని వొస్తాండాయి. అట్లనే బన్నీ వుత్సవం జరిగినెంక తలలు పగిలినోళ్లకు బండారు పూస్తావుంటిమి, యిప్పుడు డాక్టర్లు క్యాంపులు పెట్టిస్తాం డారు, మామేమన్నా వొద్దంటిమా... కాలంతో పాటు అన్నీ మారుతాయి సారూ... వోపిక పట్టాలా''

''అంత లోపల జరిగే నష్టమూ...'' వింటున్న దేవేంద్ర గొణుక్కుంటున్నాడు అంతలో,

''రొడ్డీ రొడ్డీ,'' అంటూ ఆయన అనుచరులు పరిగెత్తుకొచ్చారు.

''యేంలే, ఏమయ్యింది...''

''పోలీసోల్లు మన తోట్లోకి దూరి, కెంచుగాణ్ణీ, అప్పిగాణ్ణీ పట్టుకున్నారంట రొడ్డీ.''

''పోలీసోళ్లు యెక్కడ్దప్పి నాయాండ్లురా మనతోట్లో ఏంపనెంటరా... నిన్న పొట్టేల్ను, పది కోళ్లూ పంపిస్తిమి గదరా... గబ్బునాయాళ్లకు...''

''ఆ తావులో సారాయి కాస్తాండామని కేసు పెడ్తారంట రొడ్డీ.''

''యా తలమాసినోడురా, ఆడ మనం సారాయి కాస్తాండామని సెప్పింది గబ్బునా కొడకా...''

వురుకులతో పరుగులతో, పోలీసుల్ని తిట్టు కుంటూ వెళ్లాడు మహాలింగారెడ్డి.

ఆ సాయంత్రం అరికెర నుంచీ కళాజాత వ్యాన్ ఆలూరు కొస్తావుంటే, రెండు వ్యాన్ల నిండా పోలీసులు కర్రల్నీ, వూరి జనాల్నీ తీసుకొని స్టేషన్‌కు పోతున్నారు.

''యీ రెడ్డికీ, కర్రల సమరానికి దగ్గర సమ్మంధ ముంది ప్రకాషూ.''

''నిజం దేవేంద్రా యీ వారం రోజుల్లో వేలాది మంది జనాలు లక్షల్లో సారా వ్యాపారాలు, యితర వ్యాపారాలూ - ఆదాయమంతా చేరేది మహాలింగారెడ్డి లాంటివాళ్ల జోబీల్లోకే కదా, అట్లాటప్పుడు కర్రల సమరం వొద్దు అంటే ఆయన వింటాడా....''

''సూడు ప్రకాషూ యీ రెడ్డి ఒగ తిక్కు సర్పంచిగా వుంటూ అన్ని పనులూ సేపించుకుంటూ దుడ్లు సంపా యించుకుంటూ, యింగొక తిక్కు జనాలు మాత్రం పాతకాలంలోనే వుండాలంటాడు. పాతది ఎట్లుంది అట్లే నడసాలా, యేందన్న మారినా ఆ పాతదానికి అను కూలంగానే వుండాలంటాడు. ఇతను మామూలు మాట లకు వినే రకంగాదు ప్రకాషూ, యిట్లాంటోళ్లు తంతే తప్ప వినరు. యీ పోలీసునాయాండ్లు అలగా జనాన్ని అరెస్టు శేస్తారుగానీ, యీ రెడ్డిని అరెస్టు చేస్తారా, మీరు గూడా యీ ప్రచారాలూ, కళాజాతలూ చేస్తారు గానీ, ఎం లాభం, మహాలింగారెడ్డి లాంటోల్లే అన్నింటికీ కారణ మని చెప్తారా, వాని ప్రయోజనం కోసమే యివన్నీ జరుగు తుయని చెప్తారా, నేనైతే యీ కట్టెల్ని, స్టేషన్‌కి పోతున్న ఈ మనుషుల్ని కూడగట్టి యీ రెడ్డిని తన్నాలంటాను...''

''దేవేంద్రా గమ్మునుండూ, నువ్వొచ్చిన పనేంది, మాట్లాడే మాట్లేంది... మళ్లా యా పడబాట్లు పడాలని...'' మార్తక్క.

''దానిగ్గూడా కాలం రావాల దేవేంద్రా వోపిక పట్టు...''

నా మాటలకు యేదో అనబోతున్న దేవేంద్ర, మార్తక్కను చూసి వూరకుండి పోయాడు.

దేవేంద్ర ముఖంలో వుక్రోషం పొంగుతున్నది.

*

''ఈ హింసలో వున్న మర్మం ఏమిటి? ఎట్లా యిన్ని సంవత్సరాలుగా నడుస్తా వుందో...'' నా ప్రశ్నకు అక్క చాలాసేపు దేవేంద్ర వైపు చూస్తూ వుండిపోయింది. అది దేవేంద్రకు సంబంధించిన ప్రశ్న, దేవేంద్ర చెప్తాడని ఆశించిందేమో. దేవేంద్ర మాట్లాడలా.

''చెప్పు అడుగుతున్నాడు కదా...'' అంది.

''ప్రకాషూ! నువ్వనుకునే సమాధానము, నా దగ్గరుందనా, ఒగాల నాకు తెలీదంటే మాత్రం ప్రశ్న లేకుండా పోతుందా చెప్పు... అసలూ హింస ఎందు కుంటుందబ్బా... యా పల్లెల్లోనైనా చూడండీ ఒక రెడ్డో, ఒక నాయుడో, తక్కువ కులమోల్లని ఎట్లా పిలుస్తాడో ఎన్నడన్నా విన్నారా, యారా మాదిగోడా, యారా చాక లోడా అంటనే కదా పిలిచేది. అట్లా ఒగ రెడ్డి పిలిస్తే నొప్ప య్యిందని పిలిపించుకున్నోడు యానాడన్నా సెప్పు కుంటాడా, ఒక యికిలింపు యిగిలిచ్చి నెత్తి గోక్కుంటా 'అవురొడ్డీ... సెప్పు రొడ్డీ...సేను కాటికి పోయిరావాల్నా...' అనంటాడా లేదా... అక్కడ హింస లేదేమప్పా ఎంత అన్యాయమైన హింసప్పా అది... ఎన్ని వేల సంవత్స రాలుగా మొనసులో పెట్టుకున్న హింస... ఎన్ని వేల సంవత్సరాలు అణగబెట్టుకున్న హింస... అట్లా అణగ బెట్టుకున్న హింస పెట్రేగితే, అది ఎట్లా వుంటుందో తెల్సునా? అధికారానికి భయపడో, పోలీసోళ్లకు భయ

పడో దాపెట్టుకున్న హింసకు, ఆచారం పేరుతో సల్లుడ్సి... 'తన్ను కోండి యా కేసులూ పెట్టేది లేదంటే' యెట్ల తన్నుకుంటారో! అదే దేవరగట్టు... అక్కడ హింస కాదు... కట్టుబాటు, అడ్డుఅదుపూ ల్యాకుండా కునుసు లాడుతుంది.''

''అంటే అణుచుకున్న హింసకు దేవరగట్టు స్వేచ్ఛయిస్తుందా... అందుకే యథేచ్ఛగా తలలు పగుల గొట్టుకుంటారా, చంపుకుంటారా... చంపుకునే కేసులు తక్కువే వున్నాయి, యిన్ని సంవత్సరాలుగా...''

''అట్లాగాదు... వూర్లలో శతృత్వం వున్నోళ్లంతా యీటికొచ్చి తన్నుకుంటారనో, చంపుకుంటారనో కాదు, అట్లాంటోళ్లు ఎప్పుడో ఒగప్పుడు ప్రతీకారాలు తీర్చేసు కుంటూనే వుంటారు... యీటికే వచ్చి ఎదురెదురు నిలబడ్రు... నాపాయింటు... మొనుసులో పేర్క పోయింటే కసిని అణుచుకున్నోళ్లు సందు దొరికితే ఏం జేస్తారో అదే దేవరగట్టు.''

''అంటే మానవజాతి అంతా హింసను అణచు కొని బతుకుతూ దాన్ని తీర్చుకునే స్వేచ్ఛ లేకుండా వుందంటావా...''

''అవును, యిది ఖచ్చితం మానవజాతంతా హింస అనే బేడీల్లో వుంది. దాన్ని తెంపుకోవడానికి చేసే పోరాటాలే యుద్ధాలూ, వుద్దెమాలూ, అరాచకాలూ అన్నీ...''

వెంటనే మార్తక్క దేవేంద్రను సూటిగా చూస్తూ, ''ఓప్పొవ్ దేవేంద్ర యిన్ని దినాల్నుంచి నువ్వు నన్ను పెడ్తున్న హింసలో నువ్వు పొందుతున్న స్వేచ్ఛ ఏందప్పా,'' అంది.

దేవేంద్ర బిత్తరపోయాడు, ఒక్క నిమిషం ముఖంలో కత్తివాటుకు చుక్క నెత్తురు లేనట్లు వుండిపోయాడు. వెంటనే పగలబడి నవ్వడం మొదలుపెట్టాడు. నవ్వీ... నవ్వీ,

''సరే సరే ఓయ్ ప్లేయ్... మార్తమా... నిన్ను నేను పెడ్తుండే హింసలో నాకు స్వేచ్ఛేమీ లేదు... విముక్తీ లేదు... అందులోకి నేను కూరుకొనిపోవడమే వుంది... యింకా యింకా లోపలికి...''

''హింస పెట్టడము, తన్నుకోవడము, చంపుకోవడము స్వేచ్ఛకోసరమే అన్నావే మళ్లా...''

''అనింది కర్రక్టే... అవన్నీ చేసేది విముక్తి కోసరమే అయితే విముక్తి దొరకాలని గ్యారెంటీ లేదు. అందుకే కదా యిన్ని వేల యుద్ధాలూ... యిన్ని వేల వుద్దెమాలు... కూనీలు... ఒకటి చేస్తే విముక్తి సిక్కుదాదని అనుకుం టాడు మనిసి. అయితే అనుకొన్నది దొరకక అందులోకే కూరుకుపోతుంటాడు... నేనూ అంతే...''

''అయితే హింసకు అంతము లేదు..... మనిషికి విముక్తి లేదు... అదేనా నీ సిద్ధాంతము...''

''అవును అంతే... హింస నుండే విముక్తికి హింస. మళ్లీ అది హింసకు దారి తీయడము అదొక విష వలయము...''

మార్తక్క పగలబడి నవ్వుతూ వుంది... కళ్ల నుండీ నీళ్లు కారిపోతున్నాయి. నిజంగా నవ్వుతూ వుందా... ఏడుస్తూ వుందా... ముఖాన్ని రుద్దుకుంటూ

''అయితే నాకు విముక్తి లేదన్నమాట...'' అంది.

వెంటనే దేవేంద్ర ''నాక్కూడా లేదు...'' అన్నాడు ఏదో లోకాల నుండీ చెప్తున్న వాడిలాగా. అతని కళ్ల నుండీ కన్నీళ్లు రాలిపోతున్నాయి. గోడకు తగిలించిన డప్పు అందుకొని లయబద్ధంగా మోగించడం ప్రారంభించాడు... వున్మాదంగా మోగి స్తున్నాడు... ఒక్క వుదుటన పాట అందుకున్నాడు...

*రాగికయ్య చెలకలోన*
*నజుండమ్మా*
*నువు కలుపుతీతకు వొంగినపుడూ*
*నజుండమ్మా*
*గట్టుమీద మామిడి కొమ్మకు*
*నజుండమ్మా*
*జోలవూగిన బిడ్డెవడమ్మా*
*నజుండమ్మా*
*కలుపుసాలుకు నువ్వొంగినపుడూ*
*నజుండమ్మా*
*తేప తేపకు గుక్క పెట్టిన*
*నజుండమ్మా*
*ఏడ్చి ఏడ్చి నిద్దరోయిన బిడ్డెవడో*
*నజుండమ్మా*
*నిన్నేడిపించిన బిడ్డ ఎవడో*
*నజుండమ్మా*

*ఓఓనజుండమ్మా .....*
*నువ్వు ముడిచిన పువ్వు నీదే*
*నువ్వు నడిచిన దారి నీదే*
*నువ్వు కాచిన పండైతే ఎవరిదమ్మా*
*ఓఓ నజుండమ్మా .....*

వాళ్లమ్మ గురించి తనుకట్టిన పాట పాడ్డం మొదలుపెట్టాడు దేవేంద్ర. ఆ పాట ఎప్పుడు పాడినా, ఒక అనాథబాల్యం, ఒక తల్లిలేనితనం గుర్తొచ్చి కన్నీళ్లు

పెట్టిస్తుంది ఎవరినైనా. పాట పూర్తీ అవుతూంటే "దేవా... దేవా..." అని మార్తక్క దేవేంద్రను హత్తుకు పోతోంది.

*

రెండు కొండల నడమ విశాలమైన మైదానం, దశరా వచ్చిందంటే యింత నిర్జన అరణ్యం లక్షలాది భక్తులతో తొణికిసలాడుతుంది. యీ రాత్రిని యిక్కడ గడపాలని దేవేంద్ర అడిగితే మార్తక్క నేనూ జన సముద్రపు హోరు ముందు చిన్నబోయి నిల్చున్నాం. ఎటుజూసిన జట్లు జట్లుగా, దండదండుగా, నల్లని మేఘాల్లా కదులుతున్న భక్తజనులు. కొండల మీదా, ఎత్తైన ప్రదేశాలను ఆశ్రయించి, వూరేగింపును చూడ్డానికి వచ్చినవాళ్లు. మైదానమంతా కోలాటాలూ, చెక్క భజనలూ, భజనలూ, గుంపులు గుంపులు ఒక్కసారి జనాల్లోకి కలిసామంటే తిరిగి రాగలడం అసాధ్యమే, ఆ ప్రవాహంలో పడి అది ఎటుతోస్తే అటు వెళ్లిపోవా ల్సిందే... కాగడాల వెలుగులో శంఖధ్వానాలు వింటూ మనల్ని మనం తప్పిపోవాల్సిందే.

ఆ రాత్రి దేవేంద్ర వుద్విగ్నంగా వున్నాడు... వేల వేదనలకింద నలిగిన బిడ్డ తల్లిని అతుకున్నట్లు మార్తమ్మను అతుక్కొని వున్నాడు. వున్నట్టుండి ఏడుస్తూ... మొదలుపెట్టాడు.

"ప్రకాశూ... యీ కొండ మెట్లపై నుంచీ దిగుతున్న, ఎక్కుతున్న వేలాదిమంది కాళ్లకింద పడి నలిగి పొయ్యింది మా అమ్మ... పజ్జెనిమిది-పందొమ్మిది సంవత్సరాలైపాయ... ఇట్లాంటి బన్నీ వుత్సవాల రాత్రే మా నాయిన, మాయమ్మనూ నన్నూ యీటికి పిలుసుకొచ్చి, అర్ధరాత్రి గుడిలోకి తోలుకొనిపోయి, దేవుడు పల్లకిలో పై నుంచీ కిందికి దిగే టయానికి, నన్నూ మాయమ్మనూ జనాల్లోకి తోసేసి మాయమైపాయ... మంది కాళ్ల కిందపడి మేము సావాలనే వాని ప్లాను... పదేండ్ల పిల్లగాన్ని నన్ను పట్టుకొని మా యమ్మ, జనాల్ని తప్పించుకోలేక, మా నాయిన్ని కనుక్కోలేక, అరుస్తూ, వుక్కిరిబిక్కిరై, యీ మెట్లమీదనే యీ కర్రల దెబ్బలకి సిక్కిపాయ. ఎన్ని కర్రలు ఎన్నిసార్లు మాయమ్మ నెత్తిని పగలుగొట్టినాయో, నేను జనాల కాళ్ల సందుల్లోంచీ మెట్ల అంచు నుంచి గుండ్ల మీదికి దుమికి బతికి పోతిని... 'యమ్మో యీ పక్కరా, యీ పక్కరా' అని నేను ఎంత అరిస్తే ఆమెకి వినిపిస్తుంది చెప్పు... అరిసి, అరిసి, సొమ్మసిల్లి ఆ రాల్లలోనే పడిపోతిని... మా నాయినికి మాయమ్మ మీద అనుమానం, 'ఎవునికి కంటివే వీణ్ణి లంజదాన ఎవుడే నీ మిండగాడు,' అని ఎన్నిసార్లో ఎగిచ్చి ఎగిచ్చి తన్నింటాడో... నేను వాని పోలికలతో లేనని సతాయిచ్చేటోడు, వాని రావుడి పడ్లేక అమ్మ నన్ను మాయవ్వా వాల్లింట్లో యిడ్సి పన్లకు పోయేది. మా నాయిన యాడన్నా కన్పిస్తే దాక్కునేవాణ్ణి ఎదురుబడ్డానంటే తిడ్తాడు, కొడ్తాడు. 'ఎవునికి పుట్టిన్నా కొడుకువిరా నువ్వు,' అనంటాడు. ప్రకాశూ, గొర్లపూజారి నన్ను రాక్షసగుండ్ల మీద నుంచీ దింపి కాపాడినోడు, మర్సట్నాడు మా అవ్వావాల్లింటికి చేర్చింది ఆతనే, ఆడ మా నాయిన దొంగేడుపులు ఏడుస్తున్నాడు. నన్ను చూస్తానే మీయమ్మ ఎవునెంట వెళ్లిపోయిందిరా అనంటా నన్ను తన్నబట్నాడు, మా అవ్వకు వాణి నాటకము అర్థమై, పోలీసులకు పట్టిచ్చింది. జనాల కాళ్ల కింద పడి నలిగిపోయి గుర్తుపట్టలేకుండా వున్న శవం మా అమ్మదని నేను చెప్పినాంక మా అవ్వ ఏడుపు ఏడుపుకాదు. ఆనెంక నన్ను గుంతకళ్లు అంపించింది... హాస్టల్లో వంటమనిషి పెన్నప్ప మామ, హాస్టల్లో చోటి ప్పిస్తే హైస్కూల్లోకి ఆ తర్వాత మార్తా వాళ్ల నాన్న వెంబడి తిరుగుతా బైల్నాటకాల్లో పడితి... ఆ దినం అద్దు మానాయిన అనేవాడి మొగం నేను జూసింటెగీన... యీ జనాల కాళ్ల కింద నలిగిపోయిన మాయమ్మ మొగం వొక్కటే నిముషనిముషం గుర్తుకొస్తా వుంటే, నాకు వూపి రాడదు, నా గొంతు మీద ఎవుడో కాలు పెట్టి తొక్కుతున్నట్టు ఆ బాధ నుంచీ నాకి విడుదల లేదు... నాకి విడుదల లేదు." మార్తక్క అతన్ని ఓదార్చుతోంది, పసిబిడ్డలా లాలిస్తుంది... ఆగని అతని దుఃఖానికి తన దుఃఖంతో అడ్డుకట్ట వేస్తోంది.

రాత్రి రెండున్నర గంటల సమయం,

సింహాసనం కట్ట ఎదురుగా వున్న గొరవయ్యల గుడి మీద నుండీ దేవరగట్టు మాళమల్లేశ్వరుడి గుడి మెట్లను చూస్తున్నాము. చీకటి మేఘాలు దొంతరలు దొంతరలుగా కదిలినట్లు గుంపులు గుంపులుగా జనాలు కదులుతూ కర్రలతో విన్యాసాలు చేస్తూ వున్నారు... పోలీసులు వూరు వూరు మీదా బడి అన్ని వేలకర్రలను మోపులు మోపులు మోసుకుపోయారే మళ్లీ యిన్ని వేలకర్రలు ఎలా వచ్చాయో, సారానంతా బందు పెట్టించామన్నారు, మరిక్కడ సారా ఏరులై ఎట్లా పారుతున్నదో కాగడాలు పట్టుకొని బాణాకర్రలు పట్టుకొని తూలుతూ దిగుతున్న, ఎక్కుతున్న, తోసుకుంటున్న వేలాదిమందిని చూస్తుంటే అర్థం కాకుండా వుంది, ఇంతమంది యుద్ధానికి సిద్ధమవుతూంటే అదుపు చేయాల్సిన వ్యక్తులే కానరాకుంటే పోలీసులు చాక

చక్యం అర్థం అవుతూనూ వుంది. వీళ్ల కాళ్ల కిందబడి నలిగిపోవడాన్ని తప్పించుకోక పోలీసైనా ఏం చేస్తాడు. మరి దేవేంద్ర తల్లిని ఆ రాత్రి ఎవరైనా ఎలా దరిచేర్చ గలరు. ఆ తల్లి యిప్పుడు కూడా యీ కాళ్ల కింద పడి నలిగి పోతున్నట్లే వుంది... ఆ రాత్రి దేవేంద్ర అదృష్ట వశాత్తూ తప్పించుకొని వుండొచ్చు గానీ, అప్పటి నుండీ ఆ దుఃఖం కిందబడి ప్రతిరాత్రీ నలిగిపోతున్నట్టే వున్నాడు, దేవేంద్ర మార్తక్కతో ఎందుకట్లా ప్రవర్తిస్తాడో లీలామాత్రంగానైనా యిప్పుడర్థమవుతూ వుంది. అతని స్థితి యేమిటో స్పష్టమవుతూ వుంది.

"దేవేంద్రా నువ్విట్లా భయంలో కావాలనే వుండి పోతున్నావు. యిందులో నీకేదో సౌఖ్యముంది, యీ వూపిరాడనితనంతో విముక్తి లేకపోవడమే యిష్టంగా వుంది. అందుకే అందులో వుండిపోతున్నావు. నిన్ను భరించే మార్తక్క వుంది గాబట్టి ఆ స్థితిలో నీకింకా మోహం తీరకుండా వుంది. అసలు నీవు ఈ స్థితి నుండి బయటపడాలి. దేన్నన్నా ఆసరా చేసుకొని బయట పడాలి..."

నా మాటలకు దేవేంద్ర ముఖం వెలవెల బోయింది. తన నగ్నరూపాన్ని గురించి వివరించిన వాన్ని చూసే చూపు, కనబరిచే హావభావాలూ ఆ ముఖంలో ప్రతిఫలించాయి, అందులోనూ మార్తమ్మ ఎదుట ఆ మాటలు వినడం తన వ్యక్తిత్వానికి సవాలుగా భావించా డనిపించింది నాకు.

"అవు దేవేంద్రా... నీ ఉన్మాదాన్ని భరాయించే ఓపిక నాకులేదు. యింతకాలం ఎట్లనో భరాయించాను. యింకన్న నువు నీ అరాచకంలోంచి నీ భయం నుంచి బయటకేసుకొనేకి యేమన్నా చెయ్... చెయ్ దేవేంద్రా... నువ్వు చెయ్యాల."

మార్తమ్మ మాటలు విన్న దేవేంద్ర వుద్రేకంతో వణికిపోతున్నాడు. దిక్కుతోచనివాడిలాగా లేచి నిలబడి, ముఖం రుద్దుకుంటూ భయవిభ్రమతో, తలుపులు మూసిన గదిలో యిరక్కపోయిన పిల్లికి కొంచెం సందు దొరికితే అందులోనుంచీ శరీరాన్ని చించుకొని బయట పడేందుకు ప్రయత్నించినట్లు, యెటువైపు వెళ్లాలన్నట్లు చుట్టూ చూస్తున్నాడు, తర్వాత ఒక్క సారిగా...

"ప్రకాశూ వాడే సూడీ మార్తా వెంటపడినోడు... వాడే ఆ మిండ్లకు బుట్టినోడే మార్తా, వాణ్ణీ, నిన్ను అవుమానము చేసినోన్ని యిప్పడే యిక్కడే పిసురు పడేతట్లు తన్నాలా..." వున్మాదంగా అరుస్తూ దేవేంద్ర గుడి మీద నుండి దుమికి కింద జనాల్లోకి జారబడ్డాడు.

"దేవేంద్రా, దేవేంద్రా వొద్దు వొద్దూ..." మార్తక్కా నేనూ యిద్దరం అరుస్తున్నా వినిపించుకోకుండా ఎవరి చేతిల్లోదో బాణాకర్ర గుంజుకొని దూసుకుపోతున్నాడు.

"అయ్యో దేవేంద్రా నీకేమన్నా పిచ్చా... వున్మాదమా... ఎట్లాపని చేస్తివబ్బా," అనుకుంటూ,

"అక్కా నువ్వు కదలొద్దు, యీ జనాల్లోకొచ్చినా వంటే మళ్లీ కలుసుకోలేం, నువ్విడే వుండు, నేను నేను దేవేంద్రను చూస్తా," అని కిందికి దిగా, అప్పటికే అక్క 'దేవా...' అంటూ ఏడుస్తోంది.

జనాలను తోసుకుంటూ పోతున్నా, కొంత దూరం లో, ముందుకు పోతున్న మనిషి నెత్తిమింద కొడు తున్నాడు దేవేంద్ర, అతను వెనక్కి తిరిగి దేవేంద్రపై కలియబడ్డాడు. అంతలోనే కొండ మీద కాగడాలు గాల్లోకి లేచాయి. 'డర్ర్ర్ గోపరాక్...' అంటూ అరుపులు విన్పిస్తున్నాయి. పల్లకీ దిగుతూన్నట్లుంది, కాగడాలు అలలు అలలుగా దిగుతున్నాయి. కర్రలు గాల్లోకి లేస్తున్నాయి, దుమ్మూ ధూళీ తోపులాటతో, విపరీతంగా పెరిగింది, వీళ్ల మధ్య వుంటే కాళ్లకింద పడి నలిగి పోవడం ఖాయం అనుకుంటూ, 'దేవేంద్రా, దేవేంద్రా' అని అరుస్తున్నా, చీకటి, వెలుగూ తెరలు, తెరలు... కన్పించిన దేవేంద్ర అంతలోనే కన్పించకుండా అయ్యాడు, అయితే యీసారి తోపులాట సింహాసనం కట్ట వైపుకే జరిగింది. మళ్లీ వెనక్కే వచ్చేస్తున్నాను... తల మీద అప్రయత్నంగా చేతులు వుంచుకొని వొంగి బాణా కర్రల విసుర్లను తప్పించుకుంటున్నాను.

కాస్తా దూరంలో నలుగురైదుగురు... దేవేంద్ర మీద దాడి చేస్తూ కన్పించారు, అటువైపు తోసుకొంటూ వెళ్లాను.

"ఆపండి ఆపండి... యీ తన్నుకోవడం యేంది... వొద్దు వొద్దు," అంటూ, ఎవరో తోస్తే వాళ్ల మధ్యనే పడ్డాను. దేవేంద్ర మీద ఒక గుంపు దాడి చేస్తుంటే యింకో గుంపు దేవేంద్రకు బాసటగా వచ్చింది, రెండు గుంపులూ కర్రలతో బాదుకుంటున్నాయి, ఎవర్ని ఎందుకు కొడుతున్నారో వాళ్లకే తెలీదు. అంతలో దేవేంద్ర తలమీద బలంగా కర్రదెబ్బ తగిలి, "అబ్బా," అంటూ తూలిపోయాడు. దేవేంద్రను వొడిసి పట్టుకొని యీడ్చు కుంటూ సింహాసనం కట్ట బండలకిందికి వొరగి పోయాను.

కళ్ల ముందు తెరలు తెరలు బండారు నిండిన పచ్చని ధూళీ, ఠంగ్ ఠంగ్ మంటున్న కర్రల ధ్వనీ, 'డుర్ర్ర్ గోపరాక్...' అరుపులూ మధ్యా దాదాపు రెండు గంటలు, జీవితం మీద ఆశలు వదలి కళ్లు తేలిపో తూంటే అలాగే పడివున్నాము. పడిపోతున్న వాళ్ల నెత్తుల మీద శరీరాల మీదా వాళ్ల వెంట వున్నవాళ్లు 'పచ్చని బండారు' అద్దుతున్నారు, వాళ్ల పాలిటికి అదొక మంత్ర చూర్ణము, అది శివుడి బూడిద -అది తాకితే నొప్పి మాయమని వాళ్ల విశ్వాసం, అది పూసినా దేవేంద్ర మాత్రం మూల్గుతూనే వున్నాడు, నేలంతా పచ్చని బండారూ అక్కడక్కడా నెత్తురూ వొలికి, నేల- తెరిచిన నోరులా, రక్తం తాగుతున్న భ్రమ.

హరహర మహదేవ శ్రీ మాళమల్లేశ్వరా
హరహర మహదేవ శ్రీ మాళమల్లేశ్వరా

భక్తధ్యానాల మధ్యా, శంఖపు మోతల మధ్యా, కర్రల, కాగడాల పహరాలో తూరుపు ఎరుపెక్కే సమ యానికి వుత్సవ విగ్రహాలు అడవిని దాటిపోతున్నాయి. ధర్మకర్తగా వున్న ఏ రెడ్డి యింటిలోనే మళ్లీ సంవత్సరం దాకా అవి ప్రశాంతంగా నిద్రపోతాయి.

మాకోసం వెదుకుతూ దేవేంద్రను పిలుస్తూ మార్తమ్మ మా దగ్గరికి వచ్చింది. దేవేంద్రను చూసి, "చెప్పితే వినవే... ఎక్కడ దప్పినోనివి సిక్కితివి సామీ నీతో యెట్లా యేగల్లప్పా..." అంటూ హోరుమంది. టవల్ చించి తలకు కట్టుకట్టింది.

అప్పటికి సింహాసం కట్ట చుట్టూ నల్లటి కంబళ్లు భుజాన దిగేసుకొని నెత్తిన కంబడితో చేసిన కిరీటం పెట్టుకొని గొరవయ్యలు నిండిపోయారు. ఒక చేతిలో పిల్లన గ్రోవినీ, మరో చేతిలో ఢమరుకాన్ని ధరించి నాట్యం చేస్తున్నారు.

లయబద్ధంగా ఢమరుకం...
త్రాచుల తలలనైనా వూగించే వేణుగానం...
నాట్యమాడుతున్న నల్లని కంబళ్ల వనం...

గొరవయ్యల ఆట, మాళమల్లేశ్వరుడికి గొరవయ్యల ఆరాధన. ప్రతి సంవత్సరం బన్ని వుత్సవం ముగింపు గొరవయ్యల ఆటతో, గొరవయ్యల పూజారి రాక్షస గుండ్లకు యిచ్చే రక్తతర్పణతో ముగుస్తుంది.

శూలాన్ని చేతిలో పట్టుకొని గొరవయ్య నృత్యం చేస్తున్నాడు, ఎదురుగా వున్న రాక్షసగుండ్ల చుట్టూ ప్రదక్షణ చేస్తున్నాడు.

"దేవేంద్రా నడుస్తావా... ఎట్లా..."

"మెల్లగా పోదాంరా, యీ జనాల్ని దాటుకుంటే... ఆలూరు పోయే బండి యేదన్నా దొరుకుతుంది..."

"మార్తా... మార్తా... నడుస్తా పోదాం..."

"దేవేంద్రా తూలిపోతున్నవే... ఎట్లా నడుస్తావ్..."

ఒక్కసారిగా ఢమరుక నాదాలు మారుమోగాయి.

పిల్లనిగ్రోవి స్వరం గాలిలో తేలియాడుతూ వుంది.

"హర హర మహదేవ మాళమల్లేశ్వరా," దిక్కులు పిక్కటిల్లుతున్నాయి.

పూజారి శూలాన్ని ఒక పిక్కకు కసక్కున గుచ్చు కొని, వుబికివస్తున్న రక్తాన్ని రాక్షసగుండ్లకు అర్పించాడు.

ఆ రక్తం తాకి సూర్యుడి కిరణాలు అరుణా రుణంగా లోకమంతా వ్యాపిస్తున్నాయి.

పూజారి రెండవ శూలాన్ని రెండో పిక్కకు గుచ్చు కొని పొంగిన రక్తాన్ని యింకో గుండుకు తర్పణ గావిం చాడు. సింహాసనం కట్టకున్న యినుప గొలుసును ఫట్ మని తెంచి నాట్యం చేశాడు. భక్తులు 'ఓ' అంటూ హోరెత్తిపోయారు.

దేవేంద్ర హిస్టీరిక్‌గా,

"మార్తా మార్తా నేను జయించాను మార్తా. యీ దేవరగట్టు సమరాన్ని జయించాను, యీ వుక్కిరిబిక్కిరి చేస్తున్న యీ హింసను జయించాను మార్తా... నాకు విడుదల దొరికింది..." పలవరిస్తున్నాడు.

"దేవా దేవా... నువు జయిస్తావు దేవా... నువ్వు సాధించగలవు," అంటోంది మార్తమ్మ.

తూలుతున్న దేవేంద్రను పట్టుకొని మార్తక్క నేనూ జనాలను దాటుకుంటున్నాము.

తొడలకు రక్తం కారుతున్న పూజారి, వొణుకు తున్న గొంతుతో తెలుగు-కన్నడం కలగలిసిన మార్మిక భాషతో ఏదో వొదురుతున్నాడు. దాన్ని భవిష్యవాణిగా భావిస్తారు భక్తులు, భవిష్యత్తును చెప్తున్నడని నమ్ము తారు- అది నిజం అవుతుందని నమ్ముతారు.

దేవేంద్ర కూడా "భవిష్యవాణి భవిష్యవాణి..." అని గొణుక్కున్నాడు. తర్వాత గట్టిగా

"నేను దేవరగట్టును జయించాను..." అని అరి చాడు. నన్ను గట్టిగా పట్టుకొని,

"ప్రకాశూ... మాయమ్మ చనిపోయిన రాత్రి యీ గొరవయ్యనే నన్ను రక్షించింది, కాళ్ల కింద నలిగిపోతున్న నన్ను తన కంబడిలో పొదుపుకుంది యీతినే... యిపుడు పూజారి అయినాడు భవిష్యవాణి చెప్తున్నాడు. యీ హింస ఆగేదాకా తను రక్తతర్పణ యీస్తూ వుంటానని చెప్తాన్నాడు. మణి మల్లాసురల దాహం తీరేంతదాకా రక్తం పారుతూనే వుంటుందంట. దేవుళ్ల రాజ్యంలో రక్తం పారి తీరాలంట. ఆ రక్తంతో తడిస్తేనే వానలు కురుస్తా

యంట, పంటలు పండుతాయంట, పశులు పాలు యిస్తాయంట, మాళమల్లేశ్వరుడి మీద ఆన యీ యుద్ధం జరిగి తీరాల్సిందేనంట. ప్రకాశూ, యిదే యిదే మానవజాతి భవిష్యత్తు మనుషులకు హింస నుండీ విముక్తి తన రక్తతర్పణతోనే అంటన్నాడు గొరవయ్యల పూజారి...''

''నువ్వెలా జయించావు దేవేంద్రా...'' మార్తక్క అడిగింది.

''నా పిల్లప్పుడు యీ కర్రల సమరములో మాయమ్మని బలియిచ్చి నేను పిరికోడి మాదిరిగా పారిపోయాను. అప్పటి నుండే ఆ వుక్కిరిబిక్కిరి నాలో అట్లనే వుణ్ణింది. ఈరోజు మల్లా యిన్నేళ్లకు కర్రల సమరంలోకి దుమికి వెనక్కు వచ్చాను, పోరాడి వచ్చాను, ఆ వుక్కిరిబిక్కిరి హింసను జయించాను.''

''అడవిలో యీ సమరాన్ని జయించానంటున్నావు దేవేంద్రా, ఆ జయాపజయాల సంగతి సరే, అడవుల్లాంటి నువ్వుంటున్న మైదానాల సంగతేంది? అక్కడ చేయాల్సినవి ఎన్నో వున్నాయి గదా, మైదానాల్ని ఎప్పుడు జయించాల,'' నేను నవ్వుతూ అంటున్న మాటలకు దేవేంద్ర తీక్షణంగా ఒక చూపు చూసి మవునంగా వుండిపోయాడు.

''ప్రకాశూ నువ్వు దేన్ని దేనికో లంకెబెట్టి మాట్లాడుతున్నావు, ఆ యుద్ధాలూ, వుద్యమాల సంగతేమోగానీ, మనుషులు ఎవరికి వాళ్లు మొదట బయటపడాల, ఆ తర్వాతే దేని గురించైనా మాట్లాడాల.''

''అట్లయితే నీ సంగతీ చెప్పక్కా, నువ్వెప్పుడు బయటపడతావు. యీ గుడ్డి వెలుగులోనే ఎంత కాలముంటావు...''

''దేవేంద్రతో పాటే నేనూ...'' నవ్వుతూ అంది.

''మరి దేవేంద్రా నీ భవిష్యవాణి ఏమంటున్నది,'' అన్నాను నాటకీయంగా.

''భళిరా సారథీ, అంధకార బంధురమైన యీ కీకారణ్యపు యుద్ధం చెల్లదు. దేదీప్యమానమైన చండ ప్రచండ సూర్యతేజపు స్ఫూర్తితో చెలరేగు కొత్త ఆయుధంతో మైదాన యుద్ధ వ్యూహాలు రచించమంటున్నదిరా, జనాలను కూడగట్టమంటున్నదిరా... పదరా సారథీ పద పదా...''

దేవేంద్ర అభినయించాడు.

ముగ్గురం పగలబడి నవ్వాం, అడవి ప్రతిధ్వనించేలా మరీ మరీ నవ్వాం.

అప్పటికి పచ్చటి అడవి మీద తళతళలాడే లేత ఎండ మెరుస్తోంది.

దూరంగా వచ్చేసాం... ఈ అడవి దారి నుండీ దూరంగా ప్రధాన రహదారి కన్పిస్తూ వుంది. చల్లని గాలి ముఖాల్ని తాకుతోంది. ఆ గాలిలో లీలామాత్రంగా ఢమురక నాదాలూ, వేణుగాన స్వరాలూ విన్పిస్తున్నాయి. అడవిచెట్ల కొమ్మల నుండీ, నెమలి వొకటి వినసొంపుగా క్రేంకారధ్వనితో దేవేంద్ర తలమీదుగా ఎగిరి ఎదురుగా వున్న పెద్ద గుండుమీద వాలి ఫించాన్ని విప్పింది. అద్భుతంగా వుంది ఆ దృశ్యం.

*స్ఫూర్తి ప్రచురణలు, డిసెంబర్ 2012*

